# ఒక్కక్షణం!

– అగస్త్యప్రగడ హేమంత

యౌవనంలో ఉన్నవాడి అంతరంగంలా ఎగసి ఎగసి పడుతోంది సముద్రం.

కోరికతో రగులుతున్న వాళ్ళకంటి ఎరుపులా... రంగు మార్చుకుంది పడమటి ఆకాశం!

అనుభవాన్ని అందుకునే సమయంలోని ఆరాటంలా వేగంగా వీస్తోంది ఈదురుగాలి.

ఆగాలిలో... ఆ సముద్రం ఒడ్డున... ఎగసిపడే అలల్నీ... ఎర్రబడ్డ ఆకాశాన్ని చూస్తూ అదో రకం ఆనందాన్ని అనుభవిస్తోంది సంధ్య.

అక్కడ ఆమె ఒంటరిగాలేదు. తన ప్రియుడు వివేక్‌తో జంటగా ఉంది.

ఆమె ఒళ్ళో తలపెట్టుకుని, ప్రకృతిలో తాదాత్మ్యం పొందుతున్న ఆమెనే తదేకంగా చూస్తున్నాడు వివేక్.

సరదాగా గడపాలని వచ్చి, తీరా మౌనంగా ఏవో లోకాల్లోకి వెళ్ళిపోయిన సంధ్య... ఎంతకీ ఈ లోకంలోకి రాకపోవడంతో అతనికి విసుగొచ్చింది. ఇక ఉండబట్ట లేక... ''సంధ్యా!'' అంటూ పిల్చాడు.

అప్పటికీ ఆమెకి అతని పిలుపు వినిపించలేదు.

ఇక లాభం లేదనిపించింది. ఆమె నడుము వంపులో తన చేతిని వేసి గట్టిగా నొక్కాడు.

ఆ స్పర్శకి... ఉలిక్కిపడి... వాస్తవంలోకొచ్చింది సంధ్య.

''ఛీ! ఏవిటిది?'' అతన్ని ఒళ్ళోంచి తోసేస్తూ చిరుకోపంగా అంది.

''సరసం'' చిలిపిగా జవాబిచ్చాడతను.

ఆమాటకి ఆమె ముఖం పడమటి దిక్కును మించి ఎర్రబడింది.

''అలాంటి మాటలే ఒద్దన్నాను'' తలొంచుకుని వేలితో నేలమీద గీతలు గీస్తూ అంది. ఆమె సిగ్గు అతనికి ముచ్చటేసింది.

''అబ్బ... నువ్విలా సిగ్గుపడిపోతుంటే... ఎంత అందంగా ఉన్నావో తెలుసా!'' ఆమె దగ్గరగా వచ్చి చెవిలో గుసగుసలాడాడు వివేక్.

ఆ మాటలకి ఆమె మరింత ముడుచుకుపోయింది. ముకుళించుకుపోతున్న ఆమెని దగ్గరగా పొదువుకుని పైకి లేచాడతను.

అప్పుడు... కొంచెం కొంచెంగా తేరుకుందామె.

''ఏవిటి? అప్పుడే వెళిపోదామా!'' అతని కౌగిలి వదలడం ఇష్టంలేనట్టు... ఇబ్బందిగా అడిగింది.

''కాదు... దగ్గర్లో మా ఫ్రెండ్ ఇల్లుంది. అక్కడికి వెడదాం!'' సుతారంగా ఆమె చెంపమీద రాస్తూ అన్నాడు.

''ఇంటికెందుకు? అక్కడ ఎవరైనా ఉంటారు.'' భయంగా అంది సంధ్య.

''ఎవ్వరూ ఉండరు.''

''నీకెలా తెలుసు?''

''వాడే చెప్పాడు... అంతా ఊరెళ్ళారు. అందుకే నిన్ను తీసుకెళ్ళేది'' అదోరకంగా చెప్పాడు.

ఆమాటతో అతని ఉద్దేశం ఏవిటో ఆమెకి అర్థమైంది. అయినా అభ్యంతరం చెప్పకుండా అతని వెంట నడిచింది. ఎందుకంటే అతని మీద ఆమెకి పూర్తి నమ్మకం ఉంది.

ఇద్దరూ వెళ్ళేసరికి ఇంట్లో అతని ఫ్రెండ్ మాత్రమే ఉన్నాడు. వీళ్ళిద్దర్నీ చూసి ముసి ముసిగా నవ్వుకుంటూ అతనూ బయటకి వెళిపోయాడు.

అక్కడ వివేక్, సంధ్య ఇద్దరే మిగిలారు.

నఖశిఖ పర్యంతం ఆమెని చూసిన అతనికి ఆవేశం పొంగుకొచ్చింది.

వచ్చి... ఆమె భుజాల మీద చేతులేసి దగ్గరగా లాక్కుని ఆమె పెదవుల మీద గాఢంగా చుంబించాడు.

ఆ స్పర్శ.. వెచ్చని ఆ చుంబనం... ఆమె నిగ్రహాన్ని సడలించాయి.

'ఒద్దు...' అని చెప్పాలనుకుంది.

కానీ అప్పటికే ఆమె అతని వశం అయిపోయింది.

కాదు... అవాలనుకుంది.

కోరికతో కాలుతున్న మనసు పెదవుల్ని కదలనివ్వలేదు.

ఆ క్షణంలో సృష్టి కార్యానికి అంకురార్పణ జరిగింది.

అతడు కోరికతో జ్వలించే అగ్నిశిఖ అయితే... ఆమె ఆవేడికి కరిగిపోయే వెన్నయింది.

కరిగీ... కరిగీ... ఆజ్యంలా మారి... అతన్ని మరింత మండించింది.

క్షణాల్లో అక్కడి వాతావరణం వేడెక్కడం... చల్లబడడం రెండూ జరిగిపోయాయి.

నమ్మకంగా అతనిలో ఒదిగిపోయి... అతని కౌగిట్లో సేద తీరుతోంది సంధ్య.

సర్వస్వాన్నీ తనకి ధారబోసిన ఆమెకి కృతజ్ఞతలు చెబుతున్నట్టుగా మరోసారి ఆమెని ముద్దుల్లో ముంచెత్తాడతను.



ఒకదాని తర్వాత ఒకటిగా రోజులు గడిచిపోతున్నాయి.

ఎలాగూ ఒకసారి అయిపోయింది కనుక... ఇక హద్దులు అనవసరం అనుకుంటూ మళ్ళీ.. మళ్ళీ... ఒకటయిపోతున్నారు సంధ్య, వివేక్‌లు.

రెండు నెలలు గడిచాయి.

ఆరోజు పార్క్‌లో...

''వివేక్... మనం తొందరగా పెళ్ళి చేసుకోవాలి.'' సన్నగా గొణిగింది సంధ్య.

''పెళ్ళా? అప్పుడే ఎందుకు డియర్? మనం ఇంకా చాలా ఎంజాయ్ చెయ్యాలి.''

సిగరెట్ పొగని రింగులుగా మార్చి గాల్లోకి ఒదుల్తూ అన్నాడు.

''అదికాదు... మరో నాలుగు రోజుల్లో నాకు పెళ్ళి చూపులు.''

''ఉత్తి చూపులేగా! అదేదో శోభనం అన్నంత ఖంగారు పడతావెందుకూ?'' సిగరెట్‌ని అవతలకి విసిరేస్తూ అన్నాడు.

''నాకిష్టంలేదు.''

''ఎందుకని?''

''ఓవైపు నీదాన్ని కావాలనుకుంటూ... మరోవైపు వేరెవరి ముందో పెళ్ళిచూపులంటూ కూర్చోవడం!''

''అబ్బా... మీ ఆడాళ్ళదంతా చాదస్తం!''

''అసలు విషయం అదికాదు...'' నెమ్మదిగా అంది.

''మరేవిటి?''

''రెండు నెలల నుంచీ మనం హద్దులు మర్చిపోయి మరీ ఎంజాయ్ చేస్తున్నాం కదా!''

''ఊ అయితే?''

''నెలతప్పిందేమోనని అనుమానంగా ఉంది.''

''ఓస్... అనుమానమే కదా!''

''అహ! కాదు... నిజమే... లేడీ డాక్టర్ చెప్పింది'' అక్షరం అక్షరం కూడబలుక్కుంటూ చెప్పింది సంధ్య.

''అబ్బ! దానికంత ఖంగారెందుకూ? అబార్షన్ చేయించేసుకుంటే పోతుంది కదా!'' తేలిగ్గా అన్నాడతను.

''ఇప్పుడు నాక్కావలసింది అబార్షన్ కాదు. నీతో పెళ్ళి!'' నెమ్మదిగా అందామె.

''ఇంపాజిబుల్...'' తాపీగా అన్నాడు వివేక్.

ఆమాటకి ఉలిక్కిపడిందామె. ''ఎందుకని?'' గుండె దడదడ లాడుతుండగా అడిగింది.

''నేను తిరిగిన వాళ్ళందర్నీ పెళ్ళి చేసుకోవాలంటే ఈ ఊళ్ళో ఉన్న ఆడపిల్లలందరూ మానాన్నకి కోడళ్ళే అవుతారు!'' చిరాగ్గా అన్నాడు.

ఆమాటకి గుండె ఆగినంత పనయింది సంధ్యకి!

''అయితే... నన్ను...'' పూడుకుపోతున్న గొంతుతో అడిగింది.

''ఖచ్చితంగా మర్చిపోతాను.'' తాపీగా చెప్పాడు వివేక్.

ఆమాట వినగానే మొదట ఆమెలో దుఃఖం కట్టలు తెంచుకుంది. ఏడుస్తూ వివేక్‌ని ఎన్నోరకాలుగా అర్థించింది. అయినా అతను కరగలేదుసరికదా ఏడుస్తున్న ఆమెనలాగే ఒదిలేసి వెళ్ళిపోయాడు.

సంధ్య ఏడుస్తూ ఇంటికి చేరుకుంది. మెల్ల మెల్లగా నునుపుదేల్తూ పైపై కొస్తున్న పొట్టని చూసుకుంటుంటే.. తల్లితండ్రులూ పరువుప్రతిష్టలూ గుర్తొచ్చాయామెకి. వేరే పరిష్కార కనిపించలేదు.

అందుకే... తొందరపాటుకి ప్రాయశ్చిత్తంగా ఆరాత్రే ఆమె ఆత్మహత్య చేసుకుంది.

(అందుకే... పెళ్ళికాని అమ్మాయిలూ...! ఆవేశానికి లొంగిపోయే ముందు... ఒక్కక్షణం... ఒకే ఒక్క క్షణం ఆగి ఆలోచించండి... ఓన్లీ ఒన్ మినిట్ ప్లీజ్!)

★

